## లాఠీచార్జి వదంతులే : టౌన్ ఏసీపీ

కరీంనగర్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : క్రికెట్ అభిమానులపై కరీంనగర్‌లో లాఠీచార్జి జరిగినట్లు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంలో నిజం లేదని టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఇవన్నీ వదంతులేనని స్పష్టం చేశారు. దుబాయ్‌లో జరిగిన క్రికెట్ చాంపియన్ ట్రోఫీలో భారత జట్టు విజయం సాధించిన తర్వాత కరీంనగర్ కమిషనరేట్ విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రధాన కూడళ్లు, జంక్షన్ల వద్ద బందోబస్తు ఏర్పాటు అమలులో ఉందని, చాంపియన్ ట్రోఫీలో భారత జట్టు విజయం సాధించిన తర్వాత కొంత మంది క్రికెట్ అభిమానులు గుంపులుగా ఏర్పడి నినాదాలు చేస్తూ సంబురాలు నిర్వహించుకున్నారని, ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని, అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు క్రికెట్ అభిమానులను స్నేహపూర్వకంగా మాత్రమే అక్కడి నుంచి పంపించి వేశారని, అక్కడ ఎలాంటి లాఠీ చార్జి జరగ లేదని స్పష్టం చేశారు. అసత్యాలు ప్రసారం చేస్తున్న వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మహిళా ఉద్యోగుల సేవలు అభినందనీయం


సిబ్బందితో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్

కలెక్టరేట్, మార్చి 10 : జిల్లాను ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగానికి తోడ్పాటునందిస్తున్న మహిళా ఉద్యోగుల సేవలు అభినంద నీయమని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. సోమవారం తన చాంబర్ లో మహిళా దినోత్సవం నిర్వహించారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పలువురు మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ, మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు కూడా సమర్థవంతం గా నెరవేరుస్తున్నారని కొనియాడారు. అనంతరం మహిళా ఉద్యోగులకు శాలువా కప్పి సన్మానించారు. డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

## మహిళలు సంఘటితం కావాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 10 : మహిళలంతా సంఘటితం కావాలని, అప్పుడు ఏదైనా సాధ్యమని శాతావాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమకులపతి ఉమేశ్ కుమార్ పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో ఉమెన్స్ సెల్, జాతీయ సేవా పథకం యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ, మహిళా దినోత్సవం జరుపుకోవడం అంటే మహిళల హక్కులను గుర్తించడమన్నారు. విద్యార్థినులు ఆడపిల్లలమంటూ వెనకడుగు వేయవద్దని, ఆడ పులిలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇక్కడ సోషల్ సైన్సెస్ డీన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్, ఉమెన్స్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి పాల్గొన్నారు.

## విగ్రహాలు ఆవిష్కరించేదాకా దీక్షలు

తిమ్మాపూర్, మార్చి 10 : మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను ఆవిష్కరించేదాకా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని విగ్రహాల ఆవిష్కరణ జేఏసీ కన్వీనర్లు స్పష్టం చేశారు. విగ్రహాలను ఆవిష్కరణకు ప్రభుత్వం అనుమతివ్వాలంటూ జేఏసీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. వారి దీక్షకు బీఆర్ఎస్ నాయకులు ఇనుకొండ జితేందర్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. దీక్షలో జేఏసీ నాయకులు సంపత్, జగదీశ్వరాచారి, రాజయ్య యాదవ్, శంకర్, లక్ష్మణ్, కోమురయ్య, నర్సింగరావు, అశోక్‌రెడ్డి, లక్ష్మణ్, శంకర్, భూంరెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గరిమెళ్ల బాలకృష్ణకు నివాళి

కమాన్‌చౌరస్తా, మార్చి 10 : ఇటీవల మృతి చెందిన ఉత్తమ శ్రేణి గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు జిల్లాకు చెందిన పలువురు గాయకులు, కళాకారులు నివాళులర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వంసుడిగా పేరొందిన ఆయన లేని లోటు సంగీత లోకానికి తీరని లోటన్నారు. ఈ క్రమంలో అన్నమయ్య ఆరాధన అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కెట్ రోడ్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామీ ఆలయ ప్రాంగణ ములో అన్నమయ్య విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఆయనకు ఇష్టమైన కీర్తనను ఆలపించి సమర్పించారు. ఈ కార్యక్రంలో కేబీ శర్మ, గోగుల ప్రసాద్, కేఎస్ అనంతాచార్య, చిలకపాటి హనుమంత రావు, సుదర్శన్, విగ్నేశ్వర్, అనుపమ, ప్రధాత్రి, కడార్ల లావణ్య, దేవాలయ అర్చకులు నాగరాజు పాల్గొన్నారు.

# సమస్యలనేకం.. పట్టించుకుంటేనే పరిష్కారం

- ప్రజావాణిలో 226 దరఖాస్తుల స్వీకరణ
- సత్వరమే స్పందించాలని కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్, మార్చి 10 : కొందరిది భూ సంబంధిత సమస్య, మరి కొందరిది పెన్షన్ రావడం లేదనే బాధ, ఇంకొందరిది ఇంట్లోకి కాలుష్యం వెదజల్లే వివాదం, మరో వృద్ధురాలిది ఎవరూ పట్టించుకోవడం లేదని ఫిర్యాదు.. ఇలా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారమార్గాలు లభించడం లేదంటూ అర్జీదారులు అధికారుల వద్దకు క్యూ కట్టారు. శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో నెలన్నర విరామానంతరం సోమవారం తిరిగి ప్రారంభమైన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు పోటెత్తారు. వందలాది మంది తమ సమస్యలు చెప్పుకునేందుకు ఆడిటోరియానికి తరలి రాగా, 226 మంది నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత తొందరగా బాధితులకు న్యాయం చేయాలంటూ సూచించారు. సకాలంలో పరిష్కారం కాకపోతే ఫిర్యాదు కాపీలు తీసుకుని, నేరుగా తనవద్దకు రావాలంటూ కలెక్టర్ సూచించడంతో పలువురు అర్జీదారులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.


దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి

### పెన్షన్ కోసం ఆరు నెలల నుంచి తిరుగుతున్నా



వృత్తిరీత్యా డ్రైవర్‌ను కావడంతో మానసిక ఒత్తిడితో మూడేళ్ల కిందట పక్షపాతం వచ్చింది. దవాఖాన చుట్టూ తిరిగితే లక్షలాది రూపాయలు ఖర్చయ్యాయి. ప్రస్తుతం ఎలాంటి పనిచేయకుండా చేతికర్రతో పాటు మరొకరి సాయంతో మాత్రమే నడవగలుగుతున్నా. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. నాకు మంజూరీ కావడం లేదు. ఆరు నెలల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా, పట్టించుకోవటం లేదు. అధికారులు నన్నాదుకోవాలె.. నాకు పెన్షన్ మంజూరు చేయాలె.

-సామల సురేశ్, తుమ్మనపల్లి (హుజూరాబాద్ )

### 65 ఏళ్లున్నా.. పెన్షన్ రావడం లేదు

అరవై అయిదేళ్లు దాటుతున్నా అధికారులు నాకు ఇంకా పెన్షన్ మంజూరు చేయడం లేదు. ఇప్పటికే నాలుగు సార్లు ప్రజావాణిలో ధరఖాస్తు చేసినా. డీఆర్‌డీవో అధికారులకు నా దరఖాస్తు అప్పగిస్తండ్లు. వాళ్లు తీసుకెళ్లి ఏమి చేస్తండ్లో తెల్వటం లేదు. 57 ఏళ్లున్న వాళ్లకు మా ఊరిలో పెన్షన్లు వస్తున్నయ్. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి చెప్పులు అరుగుతున్నయ్ తప్ప నాకు మాత్రం న్యాయం జరగడం లేదు. ఇట్లెందుకు జరుగుతుందో తెలుస్తలేదు. కలెక్టరమ్మ ఇప్పటికే రెండు సార్లు చెప్పింది. అయినా, నాకు మాత్రం పెన్షన్ వస్తలేదు.

-మహ్మద్, చాకుంట (చొప్పదండి మండలం)

### బ్యాటరీ సైకిల్ కోసం వస్తే లేదంటున్నరు



పూర్తిగా దివ్యాంగుడనై, నడవలేని స్థితిలో ఉన్న నాకు బ్యాట రీ సైకిల్ కావాలని దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటికీ మూడు సార్లు ప్రజావాణికి వచ్చిన. దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు బ్యాట్రీ సైకిళ్లు లేవు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటున్నరు. నాకన్నా వెనక దరఖాస్తు చేసుకున్న వారికి ఇచ్చిండ్లు. నేను అడిగితే మాత్రం లేవంటున్నరు. ఇతరులపై ఆధారపడకుండా నా పనులు నేను చేసకుందామనుకుంటే అధికారులు నాకు సహకరించడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో నా కుటుంబానికి భారంగా మా రిన. కలెక్టరమ్మనే నన్ను ఆదుకోవాలే.

- పాతకాల ప్రభాకర్, కేశ్వాపూర్ (జమ్మికుంట)

# ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడు బలి

- అమ్మా బస్సెక్కా.. జాగ్రత్త! అంటూ ఫోన్
- మధ్యలోనే దిగి బావిలో దూకి ఆత్మహత్య
- తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో ఘటన


నిఖిల్‌రావ్(ఫైల్)

తిమ్మాపూర్, మార్చి10: ఆన్‌లైన్ గేమ్స్‌కు మరో యువకుడు బలయ్యాడు. ఉన్నత చదువులు చదివి ఉద్ద రిస్తాడనుకున్న కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు తల్లడిపోయారు. ఎల్‌ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన సిరికొండ నిఖిల్‌రావ్(22) హైదరాబాద్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్ ఆడుతూ డబ్బులు కోల్పోయి స్థానికంగా అప్పులు చేశాడు. దీంతో బయట పరువు పోతుందని భావించిన నిఖిల్‌రావ్ తండ్రి తిరుపతి రావు కొడుకును మందలించి ఇటీవలే రూ.4 లక్షల వరకు అప్పులు చెల్లించాడు. అప్పటి నుంచి నిఖిల్‌ను ఇంటివద్దే ఉంచుతున్నారు. బీఎస్సీ సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయని చెప్పడంతో సోమవారం తెల్లవారుజామున నిఖిల్‌ను తండ్రి తిరుపతిరావు కరీంనగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కించి, కూరగాయలు విక్రయించడానికి మార్కెట్‌కు వెళ్లాడు. హైదరాబాద్ బస్సు ఎక్కిన నిఖిల్ ఇందిరానగర్ స్టేజీ వద్ద మధ్యలోనే దిగి మన్నెంపల్లి వైపు గల తన తండ్రి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న జాప రవీందర్‌రెడ్డి అనే రైతు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్న సమయంలో తిరుపతిరెడ్డి వద్ద పని చేస్తున్న వ్యక్తి మోటర్ ఆఫ్ చేసేందుకు వెళ్లగా బావిగట్టున చెప్పులు కనిపించడంతో నిఖిల్ తండ్రితోపాటు స్థానికులకు సమాచారం అందించారు. వారు వచ్చి నిఖిల్‌గా గుర్తించారు. పోలీసులు చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపారు.

### అమ్మా బస్సెక్కా.. జాగ్రత్త!

నిఖిల్ హైదరాబాద్ బస్సు ఎక్కిన తర్వాత తన తల్లికి ఫోన్ చేసి హైదరాబాద్ బస్సు ఎక్కానని జాగ్రత్త అంటూ మాట్లాడాడు. అనంతరం అతడి ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. ఒక్కగానొక్క కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కలచివేసింది.

## రిజిస్ట్రేషన్‌కు ఎల్ఆర్ఎస్ నిబంధన

గంగాధర, మార్చి 10: నివాస భూముల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ నిబంధనను తప్పని సరి చేయడంతో సోమవారం గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వచ్చిన వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. 2020 జూన్ 28 తర్వాత కొనుగోలు చేసిన భూము లకు సంబంధించి లాండ్ రెగ్యులరైజ్ చేసి, ఉంటేనే ఆన్‌లైన్‌లో అనుమతి లభిస్తుంద ని, లేదంటే ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారని వాపోయారు. రెండు రోజుల క్రితం వరకు ఎలాంటి నిబంధన లేదని చెప్పారు. సడన్‌గా ఎల్ఆర్ఎస్ ఉంటేనే రిజిస్ట్రేషన్ అవుతుందని అధికారులు చెప్పడంతో ఏం చేయాలో తెలియడం లేదని వాపోయారు. కేసీఆర్ మాయంలో రూ.వెయ్యి కట్టి రెగ్యులరైజ్ చేయించుకున్న భూము లకు సైతం పేమెంట్ పెండింగ్ అని చూపిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించకుండానే నిబంధన లు మార్చడంతో ఇబ్బందులు ఇపడుతున్నారని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I Mekala Lasya C/o. NageshwarRao (Old Name) H.No. 6-30, GajyaNayak Thanda, Machareddy Mandal Kamareddy Dist. My Name and address changed to DAMMA SRAVANTHI W/o. DAMMA SATHESH (New Name) H.No. 1-75/1, V/o. Moraipalle, Musthabad Mandal Rajanna Sircilla Dist.TS
NTK-00000

CHANGE OF NAME

Eleti Parameshwari, W/o. Eleti Raghupathi (Old Name) R/o. H.No. 1-85, Bogampadu, Sirsedu Ellandakunta mandal, Karimnagar Dist. my Name was changed To Poddhutoori Parameshwari W/o. Eleti Raghupathi (New Name)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

## కలెక్టరమ్మా.. నాకుటుంబాన్ని ఆదుకోరూ !


స్వామిని తీసుకొస్తున్న నాయకులు

కలెక్టరేట్, మార్చి 10 : 'నా ఆరోగ్యం సహకరించకపోవడంతో మెడికల్ అన్‌ఫిట్ అయ్యాను. నా ఉద్యోగం నా కొడుకుకు ఇవ్వాలని అధికారులకు లిఖితపూర్వకంగా తెలిపా. వైద్యశాఖ నివేదికతో నన్ను ఉద్యోగంలో నుంచి తొలగించారు. నా కొడుకుకు మాత్రం ఉద్యోగం ఇవ్వలేదు. ఎనిమిది నెలలుగా వేతనం రాక, నా కుటుంబం పస్తులుండే పరిస్థితి నెలకొన్నది. కలెక్టరమ్మా.. మీరే నాకుటుంబాన్ని ఆదుకోవాలి' అంటూ దివ్యాంగుడైన మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగి కలెక్టర్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తూరు స్వామి అనే దివ్యాంగుడు జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహించాడు. కొన్నేళ్లుగా ఆయనకు ఆరోగ్యం సహకరించకపోవడంతో వైద్యులు ఆయనను ఉద్యోగానికి అన్‌ఫిట్‌గా నిర్ధారించారు. దీంతో, అధికారులు స్వామిని ఉద్యోగ బాధ్యతల నుంచి పక్కన బెట్టారు. గతేడాది ఆగస్టు నుంచి వేతనం కూడా నిలిపేశారు. అయితే, తన స్థానంలో తన కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలంటూ స్వామి ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశాడు. ఉన్నతాధికారుల అమోదం కోసం దానిని పంపగా, ఇప్పటివరకు పెండింగ్‌లోనే ఉన్నది. పలుసార్లు కలెక్టర్‌ను కలిసి నివేదించినా, తన కుమారుడికి ఉద్యోగం కల్పించకపోవడంతో మరోసారి కలెక్టర్‌ను కలిసి నివేదించేందుకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జరుగుతున్న ప్రజావాణికి సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా శాఖ ప్రతినిధులతో కలిసి వచ్చారు. కలెక్టర్‌ను కలువగా, కుమారుడికి ఉద్యోగావకాశం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలంటూ సంబంధితాధికారులను ఆదేశించినట్లు వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విన్నం శ్రీనివాస్ తెలిపారు.

## జనరిక్ మందుల దుకాణం ప్రారంభం

చొప్పదండి, మార్చి10 : చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జనరిక్ మందుల కేంద్రాన్ని సంఘం అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి మాట్లాడుతూ, ఈ జనరిక్ కేంద్రం రాష్ట్రంలో ప్రప్రథమంగా సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభం చేశామన్నారు. రాష్ట్రంలో తొలి జన ఔషధకేంద్రంగా ఇది నిలిచిందని పేర్కొన్నారు. ఇక్కడ అన్ని రకాల మందులు 70 శాతం వరకు తక్కువ ధరకే లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్నకొండ సింగిల్‌విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, మాజీ ఎంపీపీలు గుర్రం భూంరెడ్డి, చిలుక రవీందర్, మాజీ జడ్పీటీసీలు ఇప్పనపల్లి సాంబయ్య, మాచర్ల సౌజన్య వినయ్ కుమార్, మాజీ పాక్స్ అధ్యక్షులు గుంటి మల్లయ్య, క్యాతం పురుషోత్తం, మాజీ సర్పంచ్‌లు నాగిరెడ్డి, గన్ను శ్రీనివాస్ రెడ్డి , గంటల రమణా రెడ్డి, వెల్మ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రీబాయి పూలే వర్ధంతి

హుజూరాబాద్ టౌన్, మార్చి 10: సావిత్రీబాయి పూలే 128వ వర్ధంతి పట్టణంలో జ్యోతిరావు పూలే జయంతి కమిటీ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ హాజరై మాట్లాడారు. సావిత్రిబాయి పూలే జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఖలీద్ హుస్సేన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తాళ్లపెల్లి శ్రీనివాస్, నాయకులున్నారు.

## నిందితులను శిక్షించాలి

కలెక్టరేట్, మార్చి 10 : నగర శివారులోని బొమ్మకల్‌లో గతనెలలో జరిగిన హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ మృతుడు బెజ్జంకి మహేశ్ బంధువులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన పలువురితో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఏ1, ఏ2లే కాకుండా ఏ3ని కూడా వెంటనే అరెస్టు చేయాలని కోరారు. గంటకు పైగా కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## మొలంగూర్‌లో సెలూన్ దగ్ధం

శంకరపట్నం, మార్చి 10 : మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద ఓ సెలూన్ దగ్ధమైంది. బాధితుడు విజ్జిగిరి శివనాగేంద్ర కథనం ప్రకారం.. శివనాగేంద్ర ఆదివారం రాత్రి సెలూన్ మూసి తాళం వేసి ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి సెలూన్ నుంచి మంటలు రావడంతో చుట్టు పక్కల వారు గమనించారు. తర్వాత హుజూరాబాద్ ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అయితే గిట్టని వారు కావాలనే దగ్ధం చేశారని అనుమానం వ్యక్తం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## పోచమ్మవాడలో ఒకరి హత్య

స్నేహితుడిపైనే అనుమానాలు


హతుడు రాము (ఫైల్)

కరీంనగర్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్‌లోని పోచమ్మవాడలో నివాసం ఉంటున్న బాలసాని రాము (41) అనే క్రషీ పాయింట్ నిర్వాహకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వన్ టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని లక్ష్మీనగర్‌కు చెందిన రాము స్థానికంగా క్రషీ పాయింట్ నిర్వహించుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి పోచమ్మవాడలో నివాసం ఉంటూ సస్పెన్షన్‌కు గురైన ప్రభుత్వ ఉద్యోగి సంతపురి సంతోష్ అనే వ్యక్తితో స్నేహం ఉంది. అయితే, రాము భార్య లతశ్రీ ఊరికి వెళ్లడంతో శనివారం రాత్రి సంతోష్‌కు ఫోన్ చేసి కలుద్దామని చెప్పాడు. ఒక చోట కలుసుకుని ఇద్దరు పోచమ్మవాడలోని సంతోష్ ఇంటికి వెళ్లారు. అయితే, శనివారం ఊరికి వెళ్లిన రాము భార్య లతశ్రీ ఆదివారం నుంచి అతనికి ఫోన్ చేయగా ఎత్తడం లేదు. దీంతో లతశ్రీ ఇంటికి వచ్చి చూడగా రాము ఇంట్లో లేడు. అనుమానం వచ్చిన ఆమె వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. రంగంలోకి దిగిన పోలీసులు లతశ్రీ ఇచ్చిన వివరాల ఆధారంగా రాముకు, సంతోష్‌కు మధ్య ఫోన్ కాల్స్ ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరు స్నేహితులని తెలియడంతో పోలీసులు పోచమ్మవాడలోని సంతోష్ ఇంటికి వెళ్లి చూశారు. ఇంటికి తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు. కానీ, లోపలి నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన పోలీసులు తాళాలు పగుల గొట్టి చూడగా రాము శవమై కనిపించాడు. శనివారం రోజునే రాము బైక్‌పై సంతోష్ వెళ్లడం, అదే ప్రాంతంలోని ఓ వైన్స్ ఎదుట రాము బైక్ పార్కింగ్ చేసి ఉండడాన్ని స్థానిక సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. దీంతో రాము స్నేహితుడైన సంతోష్‌పైనే అనుమానాలు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. రాము శవం ఉన్న పరిస్థితిని బట్టి రెండు రోజుల కిందనే ఈ హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. రాము భార్య తలశ్రీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు.. కాగా, మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

## ఆస్తిపన్ను బకాయి చెల్లించాలి : కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 10 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలు తప్పనిసరి చెల్లించాలని, కలెక్టర్ పమేలా సత్పతి ఆయా శాఖల అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి ముగిసిన అనంతరం అధికారులనుద్దేశించి మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యం చేరుకోకుంటే ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధుల విషయంలో ఇబ్బంది పడాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ నిధుల నుంచి నెలాఖరులోగా చెల్లించాలని స్పష్టం చేశారు. ఈజీఎస్ పనులు, ఎస్డీఫ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో కే మహేశ్వర్, మైనార్టీ సంక్షేమాధికారి పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

చిగురుమామిడి, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం శాలువాతో సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్ రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తోట శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రదర్శనలు పరిశీలిస్తున్న వీసీ ఉమేశ్ కుమార్

## పారమితలో ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ ఎగ్జిబిషన్

### హాజరైన ఎస్‌యూ వీసీ ఉమేశ్ కుమార్

కమాన్‌చౌరస్తా, మార్చి 10 : కరీంనగర్‌లోని పారమిత ఉన్నత పాఠశాలలో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస ప్రదర్శన ఇంటర్ పీబీఎల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి యు ఉమేశ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో ప్రదర్శించిన 55 ఉత్తమ ఇన్నోవేటివ్ గ్రూప్ ప్రాజెక్టులు పరిశీలించారు. అనంతరం అనంతరం విజేతలకు అవార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇక్కడ పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు, పీబీఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వీణవంక, మార్చి 10 : చల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2001లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్క చోట చేరి, ఆడిపాడి సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని, కష్టసుఖాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు శాంతికుమార్‌సింగ్, రాంకుమార్, సత్యం రాజు, శ్రీధర్, సురేందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు జనార్దన్, మల్లారెడ్డి, సంతోష్, ప్రవీణ్, దేవదాస్, రమేశ్, నతానియేల్, రాంరెడ్డి, పుల్లారెడ్డి, స్వాతి, సునీత, అర్చన, స్వప్న పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## సమ్మెకు సిద్ధం కావాలి

### ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ నాయకుల పిలుపు

కరీంనగర్ తెలంగాణచౌక్, మార్చి 10 : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న సమ్మెలో పాల్గొనడానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సోమవారం నిర్వహించిన సమ్మె సన్నాహక రీజియన్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన అన్ని ఆర్టీసీ అంశాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమాన జీతభత్యాలు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అన్ని రకాల బస్సులను ఆర్టీసీకే ఇచ్చేటట్టు ఒప్పందం చేసుకోవాలని కోరారు. సమ్మె నోటీసులోని సమస్యలు పరిష్కరించకుంటే కార్మికులంతా సమ్మెకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ సురేశ్, జిల్లా జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి, వైస్ చైర్మన్ కొమురయ్య, నాయకులు పుల్లయ్య, రాజయ్య, మనోహర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అన్ని డిపోల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కళాశాల జీవితం బంగారు బాటకు పునాది

హుజూరాబాద్ రూరల్, మార్చి 10 : కళాశాలలో గడిపిన జీవితంలో ఎంతో సంతోషకరంగా, ఆహ్లాదకరంగా ఉంటుందని విద్యార్థి జీవితానికి ఇది ఒక పునాదని ములుగు జిల్లా ఫారెస్ట్ అధికారి మాధవి శీతల్ అన్నారు. సోమవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి హాజరైన మాధవీశీతల్ మాట్లాడుతూ, మహిళలు తమ జీవితాన్ని ఉన్నతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం మాధవి శీతల్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రిజిస్టర్ డాక్టర్ రాజేశ్వరరావు, ఈ కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ మధులత పాల్గొన్నారు.

## కుక్కదాడిలో బాలుడికి గాయాలు

శంకరపట్నం, మార్చి 10 : తాడికల్ గ్రామంలో వీధి కుక్కదాడిలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కర్ణాల కుమార్-స్వప్న దంపతుల కొడుకు సోమవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అటుగా వచ్చిన ఓ వీధికుక్క అకస్మాత్తుగా దాడి చేసి, గాయపరిచింది. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి అరుపులకు ఇంట్లో ఉన్న తల్లి వెంటనే బయటకి వచ్చి కుక్కను తరిమేసింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని తల్లిదండ్రులు వెంటనే కరీంనగర్ దవఖానకు చికిత్సకు తరలించారు.

## విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, మార్చి 10 : ఇటీవల నిర్వహించిన పలు ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతిభ చూపారు. అందుకు తల్లిదండ్రులతోపాటు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో ఇద్దరు టాపర్స్‌ను ఎంపిక చేసి, వారికి మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్ కోసం అల్ఫోర్స్ పాఠశాల యాజమాన్యం సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ క్రమంలో 174 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరు ఇప్పటికే జరిగిన ఒలింపియాడ్ పరీక్షలకు సైతం హాజరై సత్తా చాటుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇలాంటి అద్భుత అవకాశాలు కల్పించినందుకు కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేషన్, మార్చి 10 : నగరంలో ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఏసీపీ బషీర్ తెలిపారు. ఈ నెల 31లోగా చెల్లించి 25 శాతం డిస్కౌంట్ పొందాలని సూచించారు సోమవారం కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సిబ్బంది లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ అధికారులతో ఈడీ సమీక్ష

తెలంగాణచౌక్, మార్చి10 : ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని సమావేశ మందిరంలో జోనల్ పరిధిలోని ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎం డీఎంతో సోమవారం కరీంనగర్ జోనల్ ఈడీ ఖుస్రోషాఖాన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సర బడ్జెట్ నిర్వహణ, సంస్థ ఆర్థిక అభివృద్ధిపై సూచన చేశారు. ప్రతి డిపోను లాభాల బాట పట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వీణవంక, మార్చి 10 : బొంతుపల్లికి చెందిన జున్నూతుల కౌసల్య జ్ఞాపకార్థం వారి కొడుకు రాఘవరెడ్డి (ఎస్పీజీవో) మామిడాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో రతగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఎంఈవో శోభారాణి, మల్లారెడ్డిపల్లి అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు గోనెల సమ్మయ్య, ముద్దసాని శ్రీనివాస్ చేతుల మీదుగా పరీక్షా ప్యాడ్లు అందించారు. ఉపాధ్యాయులు మహేశ్వరశర్మ, సంగీత, వేణుగోపాల్, వనజ, శ్యామల పాల్గొన్నారు.

## జంగపల్లి పాఠశాల సందర్శన

గన్నేరువరం, మార్చి10: జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం రాష్ట్ర పరిశీలకులు సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాఠశాలలో అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళిక, ప్రీ ఫైనల్ పరీక్షల ఫలితాలు, ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఉన్నతి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం వినూత్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు. రాష్ట్ర పరిశీలకుడు అకాడమిక్ అడ్వైజర్ కర్ర అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి రామయ్య తదితరులు పాల్గొన్నారు.